# 1.2 స్వరాలు

| | పూర్వాచ్చులు (front vowels) | పరాచ్చులు (back vowels) |
|---|---|---|
| సంవృతాలు | ఇ, ఈ | ఉ, ఊ |
| అర్ధసంవృతాలు | ఎ, ఏ | ఒ, ఓ |
| వివృతాలు | | అ, ఆ |

అక్షర వ్యంజనం (Syllabic Consonant): ఋ

# 1.3 ఐ, ఔలు

"సాంప్రదాయిక వర్ణ సమామ్నాయంలో ప్రత్యేక లిపి సంకేతాలతో చూపించే ఐ, ఔలు (వక్ర తమాలు) నేటి తెలుగులో 'అయ్-అవ్'లుగా అంటే రెండేసి వర్ణాలుగా స్వీకరించటం లాఘవం దృష్ట్యా సమంజసం. ఉచ్చారణలో 'అయ్-ఐ'లకు, 'అవ్-ఔ'లకు తెలుగులో భేదం లేదు.
ఉదా. 'అయ్యన=ఐన', 'అవ్ను-ఔను'." (కృష్ణమూర్తి, 2000:34,35)

"తెలుగులో ఐ, ఔలు నిజానికి సంధ్యచ్చులు కావు. ఇవి అయ్, అవ్‌లతో తుల్యమే అయినా వీటిని సంధ్యచ్చులుగా పరిగణించరు. ఒక భాషలో ఇటువంటి సముదాయం సంధ్యచ్చా కాదా అనేది ఆ భాషానిర్మాణంమీద ఆధారపడి ఉంటుంది." (సుబ్రహ్మణ్యం, 1997:39)

"ప్రాచీన కాలంనుంచీ ఐ,ఔలను దేశ్య పదజాలంలో -అయి, -అవులుగా రాయడం సంప్రదాయ రచనల్లో కనిపిస్తోంది. తెలుగులో ఈ పర్యాయత ప్రాఙ్నన్నయ కాలంనుంచీ ఉంది." (రాధాకృష్ణ:1983:629)

భాషావేత్తల అభిప్రాయాలు పరిశీలించిన తరువాత దేశ్యరచనల్లో ఇలారాసే -అయి, -అవులకూ ఐ, ఔలకూ మధ్య అర్థభేదకత లేదు అని తెలుస్తుంది. కాబట్టి వీటిని వర్ణ అనుక్రమాలు (phonimic sequences)గా గ్రహించవలసి ఉంటుంది.

ఈ వర్ణ అనుక్రమ స్వేచ్ఛాపర్యాయతను అప్పకవి దేశ్య రచనలలో సమర్థించాడు.

"మెచ్చులగు కబ్బములలో
నచ్చతెనుఁగు పల్కులందు నైత్వౌత్వంబుల్

వచ్చిన నొండగు రెండగు
విచ్చలవిడి వలసెనేని విబుధస్తుత్యా!"

"లోకహితము కొఱకుఁ బైకొని దుష్టుల
లయమొనర్చి శిష్టులయిన నృపుల
నేల యేల నిలిపెఁ గొలిచ్చి నలుదెసఁ
దవిలి కృష్ణరాయఁ డవుర యనఁగ."

(అప్పకవీయం. వర్ణపరిచ్ఛేదం:109, 111)

తత్సమ పదాల్లోని ఐ, ఔల విషయంలో రాతలో ఈ పర్యాయత లేదు. తత్సమ పదాలను రాసేపుడు సంస్కృత భాషాలిఖిత సంప్రదాయాన్ని అనుసరించటం ఇందుకు కారణం.

శ్రీ రామాయణం కావ్యంలో ఐ-అయి, ఔ-అవుల మధ్య కింద చూపిన విధంగా పర్యాయత కనిపిస్తోంది.

ఉదా. ఐ ~ అయి

| | |
|---|---|
| పై (1:20) | పయి (1:2209) |
| వాదులై (6:4167) | వాదులయి (1:1739) |

ఔ ~ అవు

| | |
|---|---|
| చౌక (3:5288) | చవుక (6:518) |
| చౌకళించు (5:3728) | చవుకళించు (5:3042) |

# 1.4 పూర్ణ-అర్ధానుస్వారాలు

పూర్ణ, అర్ధానుస్వారాలను గురించి చెప్పిన ప్రాచీన తెలుగు వ్యాకర్తల్లో మూలఘటిక కేతన, విన్నకోట పెద్దన ముఖ్యులు.

మూలఘటిక కేతన అనుస్వారానికి చెప్పిన లక్షణ పద్యం:

"కుఱుచల తుది హల్లులకున్
బిఱుఁద న్నెల కొన్నయట్టి బిందువు లెల్లన్

నెఱయఁగ నూఁదుచుఁ దేలుచు
నొఱపై యిరుదెరఁగుఁజెల్లు చుండుం గృతులన్" (ఆం.భా.భూ.56)

లక్ష్యపద్యం:

"నను(గను నన్నుంగనుఁ దా
ఘనుఁడు ఘనుండనఁగఁజెల్లుఁ గవ్యనుమతిచేఁ
దనుబోఁటి లోభివాఁడితఁ
డన నిడుపుల మీఁది బిందులర బిందులగున్" (ఆం.భా.భూ.57)

విన్నకోట పెద్దన అనుస్వారానికి చెప్పిన లక్షణ పద్యం:

"అలఁతులఁదుద హల్లులకును
నలవడ వామమున నుండి యచ్చోటులచేఁ
బలుమఱుఁ దేలుచు నూఁదుచు
విలసిల్లుటగలుగు లక్ష్యవిధి నెఱుఁగఁదగున్" (కావ్యా. చూ. 9:62)

లక్ష్యపద్యం:

"తనుఁబొగడుఁ దన్నుఁబొగడును
జనుఁడు జనుండనఁగఁ దెనుఁగు జాడలు గలుగున్
మనవాఁడు వీఁడు నాఁగాఁ
జను నిడుపులు వలవ దూఁద సరళత కొఱకున్" (కావ్యా. చూ. 9:63)

కేతన, పెద్దనల పై లక్షణ, లక్ష్య పద్యాలు పరిశీలించాక కింది విషయాలు బోధపడతాయి.

అ) హ్రస్వాచ్చుకు, స్పర్శానికి మధ్య ఉన్న అనునాసికం (అర్ధానుస్వారం) "ఊదుచు", "తేల్చుచు" పలకబడుతుంది.

ఆ) దీర్ఘాచ్చుకు, స్పర్శానికి మధ్య ఉన్న అనునాసికం ఎప్పుడూ తేల్చే పలకబడుతుంది. ఈ అర్ధానుస్వారాన్ని ఆయా వర్గ పంచమాక్షరాల రూపంలో పలకవలసి ఉంటుంది.

అర్ధానుస్వారాన్ని తేల్చి పలికినపుడు దాని పూర్వ స్వరానికి ఆనునాసిక్యత (nasalisation) ఆపాదించబడుతుంది.

ఉదా. "ఊఁ" అన్నపుడు దీర్ఘ "ఉకారం" తర్వాత ఉన్న అరసున్న ప్రభావంవల్ల "ఊ"కి ఆనునాసిక్యత ఆపాదింపబడుతుంది.

పూర్ణ, అర్ధ అనుస్వారాలపై చర్చ చేసిన ప్రాచీన లక్షణ కర్తలలో అప్పకవికూడా ఒకడు.

"పొసఁగ దీర్ఘా ఖండ పూర్ణంబులను పదం
  బులు సంజ్ఞలౌ గట్టి బొట్టులకును
హ్రస్వ ఖండార్ధంబులను శబ్దములు మూఁడు
  నరసున్నలకుఁ బేరులగుచు నుండు
శబ్దంబుతోడనె జనియించు బిందువు
  సిద్ధంబు నాఁగఁ బ్రసిద్ధ మగును
బుడమి నకారంబు చెడి యైన యా యను
  స్వారంబు సాధ్య సంజ్ఞమున వెలయు

నిక్క మీ సిద్ధ సాధ్యంబు లొక్కొటొకటి
ఖండ పూర్ణంబులన ద్వి ప్రకారమయ్యె
ననియె క్రమ్మఱ హ్రస్వ దీర్ఘాక్షరముల
మీఁద రెండు తెఱంగులై మెఱయుఁగృష్ణ!" (అప్పకవీయం. వర్ణపరిచ్ఛేదం:22)

ఇది *ఆంధ్ర శబ్దచింతామణి* కర్త చెప్పిన "సిద్ధ స్సాధ్య శ్చానుస్వారః పూర్ణార్ధ భేదతో ద్వివిధః హ్రస్వా త్పూర్ణోపి భవే ద్దీర్ఘాచ్చేత్ ఖండ ఏవ సజ్జేయః" అని పూర్ణ అర్ధానుస్వారాలకి ఇచ్చిన నిర్వచనానికి వ్యాఖ్యానప్రాయమైన పద్యం. కాని అప్పకవి పై పద్యంలో దీర్ఘాక్షరాలపైకూడా పూర్ణ బిందువు వస్తున్నదని చెప్పాడు. దీనిని గుర్తించి ఉదాహరణలతో వివరిస్తూ రేఖా చిత్రంలో నిరూపించినవారు శ్రీరామరాజు(1996:34).



అర్థానుస్వారాన్ని శాసనాల్లోనూ, ప్రాచీన గ్రంథాల్లోనూ పూర్ణానుస్వారంగానే రాసి తేల్చి పలికేవా రనటానికి ఆధారాలున్నాయి. అంటే ప్రాచీన కాలంలో పూర్ణ, అర్థానుస్వారాలు రెంటికీ పూర్ణానుస్వార లేఖన చిహ్నాన్నే ఉపయోగించేవా రన్నమాట. పూర్ణానుస్వారంగా పలకవలసివచ్చినపుడు ఊదిపలికేవారు. అర్థానుస్వారంగా పలకవలసినపుడు తేల్చి పలికేవారు.

క్రీ.శ.848 అద్దంకి శాసనంలో "పట్టంబు కట్టించె ప్రభుంబండరంగు" అని ఒక ద్విపద పాదం ఉంది. ద్విపదపాదంలో మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. "పట్టంబు", "కట్టించె" అనే పదాల్లోని అనునాసికాన్ని తేల్చిపలికినా, ఊదిపలికినా గణాలు సరిపోతాయి. (అవి ఇంద్రగణాలు కాబట్టి) ఇక; "ప్రభుంబండ"లోని "భు"కారం తర్వాతి అనునాసికాన్ని ఊది పలికితే గణం చెడుతుంది. ఇక్కడ పూర్ణానుస్వారమే ఉంది. అయినా, దాన్ని "ఊదుచు" పలకకుండా ఆ కాలంలో "తేల్చి" పలికేవా రని అర్థంచేసుకోవాలి. అపుడు భుకారానికి ఆనునాసిక్యత ఏర్పడినా గణ భంగం కాదు.

"హ్రస్వముమీఁది ఖండబిందువునకుఁ బూర్ణబిందువు వైకల్పికముగ నగును" , "దీర్ఘము మీఁద సాధ్యపూర్ణము లేదు" "సంస్కృత సమేతరములయిన తెలుగు శబ్దముల యందుఁ బరుష సరళములకు ముందే బిందువు కానంబడుచున్నది" (బా.వ్యా .సంజ్ఞా.: 14, 15, 16) అని సూత్రించి చిన్నయసూరి అనుస్వారంమీద కొంత చర్చచేశారు.

నన్నెచోడుని కుమారసంభవంలో:

"పొండిగ నగజ తపశ్శిఖి
మూండు జగంబులను దీవ్రముగఁ బర్విన బ్ర
హ్మాండము కాఁచిన కాంచన
భాండము క్రియఁదాల్చెఁ దత్ప్రభాసితమై" (కు.సం. 6:157)

"వీండేమి సేయుఁ బంచిన వాండుండఁగ..." (కు.సం.10:155) వంటి పద్యాల్లో పూర్ణబిందు పూర్వక డకారం ప్రాసస్థానంలో ప్రయోగించబడింది.

దీర్ఘంమీద సాధ్యపూర్ణం లేదనటానికి, నిడుపులమీది బిందులరబిందు లనటానికి ఇటువంటి ఉదాహరణలు అపవాదాలుగా నిలుస్తాయి.

సంస్కృత సమేతర శబ్దాలలో అనుస్వారం స్పర్శవర్ణాలకు పరుష సరళాలకు) ముందే వస్తుంది కాబట్టి భాషాశాస్త్రవేత్తలు దీన్ని ప్రత్యేక వర్ణంగా గుర్తించలేదు. పైగా, దేశ్య పదజాలంలో

/మనణ/ అనే వర్ణాలను మాత్రమే అనునాసిక వర్ణాలుగా భాషాశాస్త్రవేత్తలు గుర్తించారు. (కృష్ణమూర్తి, 1972:2, 3) నన్నయ భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాసిన నాగభూషణరావు (1964:2), శ్రీనాథభాషా పరిశీలన కావించిన అనంతరామశాస్త్రి (1982:4,12,13), తిక్కన భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాసిన వెంకటేశ్వరరావు (1992:4,5) మొ.వారు ఇదే పద్ధతిని పాటించి అనుస్వార నిర్ణయం చేశారు. ఎమెనో (1946:86-93), కృష్ణమూర్తి (1972:1-4) వంటి భాషాశాస్త్రవేత్తలు తక్కిన వాటిలో /ఙ/ వర్ణాన్ని కూడా అనునాసిక వర్ణంగా గుర్తించి, ఞకారాన్ని /న/వర్ణానికి సవర్ణంగా గ్రహించారు.

అర్ధానుస్వారాన్ని భాషాశాస్త్రవేత్తలు ప్రత్యేక వర్ణంగా గుర్తించరు. అయితే ఇది దీర్ఘాచ్చుమీద అనునాసిక లోపాన్నీ, హ్రస్వాచ్చుమీద అనునాసికం వికల్పంగా లోపించడాన్నీ తెలియజేస్తుంది. కాబట్టి భాషాయంత్రాంగంలో ఈ పనుల్ని నిర్వహించేందుకు ఏర్పడ్డ లిపి సంకేతంగా మాత్రమే అర్ధానుస్వారాన్ని గుర్తించడం జరుగుతుంది.

అర్ధానుస్వారాన్ని ప్రత్యేక వర్ణంగా గుర్తించకపోయినా సంధి నిరూపణలో దానికున్న ప్రాముఖ్యతను కొందరు భాషాశాస్త్రవేత్తలు గుర్తించారు. "Throughout this work I have followed the printing system by using a tilde (~) in the place of ( ‹ ), because this has at the same time, a morphophonemic advantage as well as a historical suggestivity in description.... " (కృష్ణమూర్తి, 1972:3)

శ్రీరామాయణం పరిష్కృత ప్రతి ఆధారంగా జరిపిన ఈ అధ్యయనంలో పై పద్ధతినే అనుసరించడం జరిగింది. నిండు సున్నను వర్గానునాసికాలకు పర్యాయ సంకేతంగానే తప్ప ప్రత్యేక వర్ణంగా గుర్తించలేదు. ధ్వనిలో వినిపించే సస్థానీయానునాసికం (homorganic nasal) స్థానంలో పూర్ణబిందువునే రాయడం జరిగింది. దీనికి అపవాదంగా నిలిచే /ముంగ/ (ముఙ్గ) (బాలకృష్ణ:2003:7) వంటి ప్రయోగాలు శ్రీరామాయణంలో లేవు. అలాగే అర్ధానుస్వారాన్ని ప్రత్యేక వర్ణంగా గుర్తించలేదు.

# 1.5 రేఫ పదాది సంయుక్తత

శ్రీరామాయణంలో కింది హల్వర్ణాలతో రేఫం పదాది సంయుక్తతను పొందుతుంది.

## 1.5.1 స్పర్శం+తాడితం

/ప్ర-/ ప్రొద్దు(1:1074)

/బ్ర-/ బ్రతుకు(1:478)

/త్ర-/ త్రాళ్ళు(1:3966)
/ద్ర-/ ద్రోచి(1:3701)
/క్ర-/ క్రంత(1:5372)
/గ్ర-/ గ్రక్కున(1:1955)

### 1.5.2 ఊష్మం+తాడితం

/స్ర-/ స్రువమ్ము(3:18)

### 1.5.3 అనునాసికం+తాడితం

/మ్ర-/ మ్రింగు(1:1924)
మ్రొక్కి(1:5460)

### 1.5.4 అంతస్థం+తాడితం

/వ్ర-/ వ్రాలి(1:5735)
వ్రేయ(1:4103)

## 1.6 సాధు-శకట రేఫలు

సాధు,శకట రేఫలు రెండూ దంతమూలీయ కంపితాలు. శకట రేఫ సాధు రేఫకన్నా ఎక్కువ కంపితోచ్చారణ కలిగిఉంటుంది. '11, 12 శతాబ్దాల కాలంలోని తెలుగు శాసన భాషలో ఱవర్ణం తన ప్రత్యేకోచ్చారణని పోగొట్టుకొన్నట్టు ఈ ఉచ్చారణ భేదం లేకపోవటం ప్రాఙ్నన్నయ కాలానికే ప్రారంభమై'నట్టు మహదేవశాస్త్రి (1969:42) పేర్కొన్నారు.

నన్నయ, నన్నెచోడుడు ఈ రెంటినీ ప్రత్యేక వర్ణాలుగా గుర్తించారు. యతి-ప్రాస స్థానాల్లో సాంకర్యంలేని వారి ప్రయోగాలు ఇందుకు నిదర్శనం.

నన్నయ- యతిస్థానంలో సాధు రేఫ ప్రయోగం:

"రాజకులైక భూషణుఁడు రాజమనోహరుఁడన్యరాజతే" (భార.ఆది.1:3)

ప్రాసస్థానంలో సాధురేఫ ప్రయోగం

"సారమతిం... ... ... ... యుక్తితో
నారసి మేలునా... ... ... నా
నారుచిరార్థ ... ... ... మహా
భారత ... ... ... ... జగద్ధితంబుగన్ (భార.ఆది.1:25)

ప్రాసస్థానంలో శకట రేఫ ప్రయోగానికి ఉదాహరణ

"నెఱినుఱక... ...
నెఱఁకులు ...
పఱికోర్వక ...
వెఱచి ... ... విషయాధిపతుల్" (భార.ఆది.4:201)

తిక్కన రచనలో ప్రాస స్థానంలో ఈ రెంటి సాంకర్యం ఉన్న ఉదాహరణలు కనిపిస్తున్నాయి.

"సుఱసుఱ... ...
తెఱఁగున ...
కొరఁత ... ...
బెఱవారల ... ...వదనుండై (నిర్వ.రామా.8:106)

సాధు, శకట రేఫల సాంకర్యానికి వీటి మధ్య ఉచ్చారణ భేదం తిక్కన కాలానికి క్రమంగా నశించి పోతూండటం కారణం కావచ్చు. తిరిగి, ఈ భేదం శ్రీనాథుని రచనల్లో కనిపిస్తుంది.

శ్రీనాథ సమకాలీన లాక్షణికులు సాధు, శకట రేఫల పట్టికలు తయారుచేయడం ఇందుకు నిదర్శనం. శ్రీనాథుడు తనరచనల్లో చాలాచోట్ల సాధు, శకట రేఫల్ని ప్రత్యేకవర్ణాలుగా భావించి వేర్వేరుగానే ప్రయోగించాడు. కొన్నిచోట్ల మాత్రం సాధు, శకట రేఫలకి ప్రాసవేశాడు.

యతిస్థానంలో సాధురేఫ ప్రయోగం:

"రాజ రఘు రాములల్లాడ రమణ సుతులు" (భీమ.1:33)

యతి స్థానంలో శకటరేఫ ప్రయోగం:

"ఱిక్కించుకొనియున్న ఱెక్కమొత్తము" (శృం.నై.2:5)

ప్రాస స్థానంలో సాధురేఫ ప్రయోగం:

"ఆరాజు... ...
నీరాజన... ...
తారాతి... ...
దారుణ... ...శిఖలన్" (శృం.నై.1:56)

ప్రాస స్థానంలో శకటరేఫ ప్రయోగం:

"నిఱుపేద... ...
బఱఱెంచు... ...
నిఱుపేద ... ...
పిఱియఁగ ... ...దానిన్" (శృం.నై.4:73)

సాధు శకట రేఫలు రెంటికీ ప్రాస వేసిన శ్రీనాథుని ప్రయోగం:

"తరుణి విజ్ఞాన మీసూక్ష్మ మెఱిఁగి కొనుము" (కాశీ.3:70)

శాసనాల్లో శకటరేఫ సంయుక్తాక్షరాల్లో ఉండటంవల్ల (క్ఱొచ్చె (sii.601.27, 700-25), ప్ఱోలనాణ్డు (E118-58-60-14,732)) (కృష్ణమూర్తి, సం.1979:55) 'ఱ' వర్ణం సంయుక్తాక్షరాల్లో వస్తే రేఫ అవుతుందని ప్రౌఢ వ్యాకర్త నిర్ణయించాడు. (ప్రౌఢ.వ్యా.ముక్త:2)

శకట రేఫ తర్వాతి హల్లుతో సంయోగం చెందినపుడు సాధు రేఫగా మారిన ఉదాహరణలు శ్రీనాథుని రచనల్లో కనిపిస్తున్నాయి

చిఱుతొండనంబి (హర.2:32)
చిర్తొండనంబి (హర.2:29)

శ్రీరామాయణంలోనూ ఈవిధమైన ప్రయోగాలు కనిపిస్తున్నాయి. సాధు, శకట రేఫలకి వేర్వేరుగానూ, కలిపీ ప్రాస కూర్చిన ప్రయోగానికి ఉదాహరణ

"కురిసె మిన్నుననుండి-కుసుమ వర్షములు
మొరసెను నిర్జర-మురవారములు" (1:26337,38)

"గొఱమాలితిరి మిమ్ముఁ-గోపించియిట్టి
కొఱఁత యెవ్వఁడు చేసె?-కులధర్మసరణి" (1:2789,90)

"మరగుజ్జులనుఁజేసి-మంచిరూపములు
బెఱిచినఁ గన్నీరు-చిందనందఱునుఁ" (1:2781,82)

యతిస్థానంలో:

"ఱెక్కలు విఱిగి ధ-రిత్రిఁబోలేక" (1:4061)

శ్రీరామాయణంలో సాధు శకటరేఫల భేదకవ్యాప్తి (contrastive distribution)ని నిరూపించేందుకు ఉదాహరణలు కొన్ని కనిపిస్తున్నాయి.

"నీరు" శబ్దం సాధురేఫతో ఉన్నపుడు "ఉదక"మనే అర్థంలో శకటరేఫతో ఉన్నప్పుడు "బూడిద" అనే అర్థంలో వాడటం శ్రీనాథుడి రచనల్లో ఉంది. వరదరాజు రామాయణంలో సాధురేఫ ప్రయోగంతోకూడా "బూడిద"అనే అర్థంలో ప్రయోగించబడింది.

ఉదకమనే అర్థంలో (సాధురేఫ ప్రయోగం)

"పోనీక యయ్యేరు-పుడిసెండునీరు (1:3335)

బూడిద అనే అర్థంలో (సాధురేఫ ప్రయోగం)

"నెట్టుక యాలంక-నీరు సేయుటకు" (1:740)

బూడిద అనే అర్థంలో (శకటరేఫ ప్రయోగం)

"కర్తనుగతి నీఱు-గప్పినవహ్ని" (2:3629)

అర్థభేదం లేకుండా సాధు, శకట రేఫలు ఒకే పదంలో ఉన్న ప్రయోగాలు వరదరాజు రామాయణంలో చాలాఉన్నాయి.

నెరవేర్చి: "యడలుచు నెరవేర్చి-యశ్వమేధంబు" (1:3200)

నెఱవేర్చి: "నియమముల్_ దప్పక-నెఱవేర్చినదాన" (6:11286)

మరునాడు: "మరునాడు రామ-లక్ష్మణులు ప్రభాత" (1:2547)

మఱునాడు: "మఱునాఁడు తాఁబడ-మఱి కోటగవని" (6:8085)

పై ఉదాహరణలద్వారా వరదరాజు రామాయణం రచించే కాలానికి సాధు, శకట రేఫల మధ్య ఉచ్చారణలో భేదం స్వల్పంగా ఉన్నట్టు స్పష్టమౌతుంది.

"నీరు" శబ్దంలోని సాధురేఫ ప్రయోగం "ఉదకం", "బూడిద" అనే రెండు అర్థాలు ఇచ్చేట్టుగా ఉన్న ఉదాహరణలు వరదరాజు కాలంనాటి కావ్య భాషలో సాధు, శకటరేఫల ప్రయోగంలోని అనిశ్చితిని తెలుపుతున్నాయి.

# 1.7 వర్ణాలమధ్య భేదకవ్యాప్తి

## 1.7.1 వ్యంజనాలు

| | |
|---|---|
| /కగ/ | కొడిగె(5:4320)(చూరుముందరిభాగం) |
| | గొడిగ(5:787)(గులకరాయి) |
| /కఖ/ | కండ(1:4632) |
| | ఖండము(2:3352) |
| /గఘ/ | జంగులు(1:853) |
| | జంఘులు(1:5087)(వందిమాగధి/ఇష్టురాలు) |
| /కఘ/ | కటిసీమ(1:3690) |
| | ఘటిక(5:777) |
| /ఖగ/ | ఖండము(2:3352) |
| | గండ(1:4632) |
| /చజ/ | చయము(1:611) |
| | జయము(2:572) |

| | |
|---|---|
| /చజ/ | చనుము(2:2097) |
| | నిజము(1:231) |
| /జజ/ | జయము(2:527) |
| | నిజము (1:231) |
| /జఝ/ | జల్లు(3:1303) |
| | ఝల్లు(1:1214) |
| /చఝ/ | చల్లు(1:5336) |
| | ఝల్లు(1:1214) |
| /ఛఝ/ | ఛిద్రము(1:999) |
| | ఝరి(2:3012) |
| /ఛజ/ | ఛాయ(1:1510) |
| | కెంజాయ(2:6125) |
| /టడ/ | కోటి(1:8) |
| | కోడి(1:4590) |
| /టఠ/ | పాట(1:1099) |
| | పాఠకులు(2:7859) |
| /డఢ/ | పాడి(1:1711) |
| | ప్రౌఢి(3:5198) |
| /ఠఢ/ | పాఠకులు(2:7859) |
| | ప్రౌఢి(3:5198) |
| /డఠ/ | జడ(2:9491) |
| | జఠర(6:6044) |
| /తద/ | తక్కు(1:1142) |
| | దిక్కు(1:1956) |
| /తథ/ | కతన(1:921) |
| | కథ (1:57) |
| /దధ/ | దరి(1:2151) |
| | ధరిత్రి(1:171) |
| /దథ/ | దరి(1:2151) |
| | రథము(1:1733) |
| /పబ/ | పాలు(1:1395) |
| | బాలు(1:1881) |
| /పఫ/ | పని(1:36) |
| | ఫలక(4:2913) |
| /బభ/ | బంతి(2:4712) |
| | భంగము(1:3340) |

| | |
|---|---|
| /నణ/ | పని(1:36) |
| | ఫణి(5:1043) |
| /నమ/ | నెరయ(2:2760) |
| | మెరయు(2:8323) |
| /ణమ/ | ఫణి(5:1043) |
| | మణి(1:846) |
| /డణ/ | జాడ(1:441) |
| | గణము(1:498) |
| /దన/ | మదము(2:335) |
| | మానుము(2:5966) |
| /పమ/ | పది(1:1434) |
| | మది(1:1746) |
| /బమ/ | బాట(2:1051) |
| | మాట(2:1227) |
| /ఫమ/ | ఫణి(5:1043) |
| | మణి(1:846) |
| /శషశహ/ | శంఖము(6:251) |
| | మేషాండము(1:3689) |
| | సంగతి(1:27) |
| | మోహము(1:2417) |
| /షస/ | మేషము(1:3696) |
| | మీసము(6:43) |
| /శస/ | శరము(1:396) |
| | సరము(1:1300) |
| /సహ/ | సరము(1:1300) |
| | హరి(1:200) |
| /శహ/ | శరము(1:396) |
| | హారము(1:5317) |
| /కగహ/ | కడి(2:9241) |
| | గడి(2:9241) |
| | హరి(1:200) |
| /చస/ | చరము(3:5510) |
| | సరము(1:1300) |
| /చశ/ | చక్రుడు(6:5058) |
| | శక్రుడు(6:1401)(=ఇంద్రుడు) |